AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in





## ఆర్అండ్‌బీ అతిథి గృహంలోకి ఏసీబీ కార్యాలయం

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా కేంద్రంలోని అవినీతి నిరోధక శాఖ కార్యాలయాన్ని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలోకి మార్చారు. గతంలో కంఠేశ్వర్‌లోని అయ్యప్ప ఆలయం సమీపంలోని అద్దె భవనంలో కార్యకలాపాలు కొనసాగేవి. అయితే ప్రస్తుతం అక్కడి నుంచి గెస్ట్ హౌస్‌లోకి మార్చారు.











క్రిస్మస్ వేడుకలను ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. గురువారం ఉదయం చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా గీతాలు ఆలపించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, బాన్సువాడలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.



# ఘనంగా క్రిస్మస్ వేడుకలు




బాన్సువాడ మండల కేంద్రంలో..




ఎల్లారెడ్డిలో..



నిజామాబాద్‌లోని కంఠేశ్వర్ చర్చిలో ఎమ్మెల్యే ధన్‌పాల్..




సెల్ఫీ దిగుతున్న యువతులు



ముప్కాల్ మండల కేంద్రంలో..




ఆర్మూర్‌లోని మామిడిపల్లిలో..



శ్రీరాంపూర్‌లోని పెట్రోల్ బంక్‌లో శాంటాక్లాజ్ వేషధారణలో..

## కూల్‌డ్రింక్‌లు, చీరలతో ఓటర్ల నిరసన

**అక్షరటుడే, కామారెడ్డి:** 'నన్ను గెలిపిస్తామంటే బీర్లు పంచిన.. చీరలు ఇచ్చిన.. తమ్సప్, స్ప్రైట్ బాటిళ్లు ఇచ్చాను. అన్ని తీసుకుని తాగి నన్ను ఓడించారు' అంటూ రాయలేని భాషలో బూతు పురాణం అందుకుంది ఓడిన వార్డు మెంబర్ అభ్యర్థి. దీంతో చిర్రెత్తుకొచ్చిన ఓటర్లు బీర్లు, చీరలు, తమ్సప్, స్ప్రైట్ బాటిళ్లతో గ్రామ పంచాయతీ ముందు నిరసన తెలిపారు. ఈ ఘటన రామారెడ్డి మండలం ఉప్పలవాయిలో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాబవ్వ రెండో వార్డు నుంచి పోటీ చేశారు. ఎన్నికల్లో గెలవడానికి అందరి మాదిరిగా ఆమె కూడా ఓటర్లను ఆకట్టుకునేందుకు బీర్లు, మహిళలకు చీరలు, థమ్సప్, స్ప్రైట్ బాటిళ్లు పంపిణీ చేసింది. తీరా ఎన్నికల్లో ప్రత్యర్థి అభ్యర్థి గెలుపొందారు. దాంతో ఫ్రస్టేషన్‌కు గురైన బాబవ్వ వారం రోజుల నుంచి వార్డు ఓటర్లను ఇష్టానుసారంగా పరుష పదజాలంతో దూషిస్తోంది. గురువారం కూడా ఆమె తన నోటికి పని చెప్పడంతో ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆమె పంపిణీ చేసిన చీరలు, బీర్లు, థమ్సప్, స్ప్రైట్ బాటిళ్లను తీసుకుని



వచ్చి గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు పడేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వార్డు ఓటర్లు మాట్లాడుతూ.. ఎన్నికల్లో తమకు ఆమె చెప్పిన చీరలు, బీర్లను పంచాలని అడగలేదని, అప్పుడు ఇచ్చి ఇప్పుడు ఓటమి చెంది ఇష్టమున్నట్టు మాట్లాడటం సరికాదన్నారు. విషయం పోలీసులకు చేరడంతో రామారెడ్డి ఎస్సై రాజశేఖర్ గ్రామానికి చేరుకుని నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలను సముదాయించే ప్రయత్నం చేయగా జీపీ ఆవరణలో బాటిల్స్ పెట్టేసి వెళ్లిపోయారు.

## ఆదివాసీ నాయక్‌పోడ్ జిల్లా సేవా సంఘం కార్యవర్గం




**అక్షరటుడే, ఇందూరు:** ఆదివాసీ నాయక్‌పోడ్ జిల్లా సేవా సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడు బండారి భోజన్న ఆధ్వర్యంలో గురువారం ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా గాండ్ల రాంచందర్, ప్రధానకార్యదర్శిగా పుట్ట శివ శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కావాల్కడి పోశెట్టి, కోశాధికారిగా శానం పవన్ కుమార్, అధికార ప్రతినిధిగా పుట్ట దుర్గ మల్లేష్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లాలో ఇటీవల గెలుపొందిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లతో ఆదివాసీ నాయక్‌పోడ్ జిల్లా ప్రజాప్రతినిధుల ఫోరంను కూడా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎర్రం శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీగా దాత్రికి అంజయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సుంకరి రాజు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాలను ఆదివాసి నాయక్‌పోడ్ సంఘం సభ్యులు సన్మానించారు.



## చెరువు పునరుద్ధరణ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే పోచారం

**అక్షరటుడే, బాన్సువాడ :** బాన్సువాడ పట్టణంలోని 13వ వార్డులో ఉన్న ఎల్లయ్య చెరువును ఆధునికీకరించనున్నట్లు ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేలా చెరువును తీర్చిదిద్దుతామన్నారు. ఎల్లయ్య చెరువు పనులను రూ.3.14 కోట్ల వ్యయంతో ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ ఛైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి ఆయన గురువారం ప్రారంభించారు. చెరువు జీవం కోల్పోయిన నేపథ్యంలో దాని అభివృద్ధి, ఆధునికీకరణ కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని చెప్పారు. పట్టణ ప్రజలకు విహార వేదికగా మారేలా ట్యాంక్‌బండ్ తరహాలో ఎల్లయ్య చెరువును అభివృద్ధి చేస్తున్నామని, కల్కి చెరువు మాదిరిగా సుందరీకరణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పనుల ద్వారా పరిసర ప్రాంతాల అభివృద్ధితో పాటు ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జంగం గంగాధర్, ఖాలేఖ్, మొహమ్మద్ గౌస్, కృష్ణారెడ్డి, ఎజాస్, నార్ల సురేష్, వెంకన్న గుప్తా, మోహన్ నాయక్, రాజేశ్వర్, ఎండీ దావూద్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్స్ పోగొట్టుకుంటే వెంటనే ఫిర్యాదు చేయాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** మొబైల్ కేంద్రంగా సైబర్ మోసాలు జరుగుతున్నాయని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. బాధితులు పోగొట్టుకున్న 112 మొబైళ్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్పీ రాజేష్ చంద్ర మీడియాతో మాట్లాడారు. మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరికీ నిత్యావసరంగా మారిందన్నారు. అందులో వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్ వివరాలు, పాస్‌వర్డ్లు, సోషల్ మీడియా అకౌంట్లు, వ్యక్తిగత ఫోటోలు వంటి కీలకమైన డేటా ఉంటుందన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకోవడం అనేది కేవలం పరికరాన్ని కోల్పోవడమే కాకుండా, వ్యక్తిగత, ఆర్థిక భద్రతకు కూడా ప్రమాదంగా మారుతుందని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్ పోయినా, చోరీకి గురైనా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వాలని సూచించారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా గత 15 రోజుల్లో రూ.18 లక్షల విలువైన 112 మొబైల్ ఫోన్లు రికవరీ చేయడం జరిగిందని తెలిపారు. పోర్టల్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు జిల్లాలో రూ.6.85 కోట్ల విలువైన 4,281 మొబైల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు చెప్పారు.





## బోధన్ పట్టణంలో ఎమ్మెల్యే పర్యటన

**అక్షరటుడే, బోధన్:** బోధన్ మున్సిపల్ పరిధిలో పలు వార్డుల్లో ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి గురువారం పర్యటించారు. ఆయా కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. పట్టణంలోని పలు కాలనీవాసులతో మాట్లాడారు. కాలనీలో నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా సీసీ రోడ్లను, డ్రెయినేజీల నిర్మాణం కూడా తక్షణమే చేపడతామన్నారు. కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

**అక్షరటుడే, ఇందూరు :** పీఆర్టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో విద్యాభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మోహన్ రెడ్డి, కిషన్, సోషల్ మీడియా కన్వీనర్ రవీందర్, జిల్లా రాష్ట్ర నాయకులు, ఆయా మండలాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ నాయకుల చేరిక

**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని పెద్దమ్మకాడి తండా గ్రామ పంచాయతీకి చెందిన బీఆర్ఎస్ నాయకులు అంబర్‌సింగ్, రమేశ్ తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ప్రజా సంక్షేమ పాలనకు ఆకర్షితులై తాము పార్టీలో చేరుతున్నట్లు ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొదిరే స్వామి, నాయకులు కన్నే సురేందర్, జేజే నర్సయ్య, అనంతరావు, జనార్దన్, నర్సయ్య పాల్గొన్నారు.

## డెస్క్ జర్నలిస్టులకు అన్యాయం చేస్తే ఊరుకోబోం



**అక్షరటుడే, ఇందూరు:** తమకు అన్యాయం చేస్తే ఊరుకోబోమని డెస్క్ జర్నలిస్టులు గొంతెత్తారు. అక్రెడిటేషన్లలో కోత విధించేందుకు ప్రభుత్వం జారీ చేసిన జీవో 252ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం డెస్క్ జర్నలిస్టులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. జీవో 252 ద్వారా డెస్క్ జర్నలిస్టులకు అన్యాయం చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. అక్రెడిటేషన్, మీడియా కార్డుల పేరుతో జర్నలిస్టులను విభజించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ప్రభుత్వ నిర్ణయంపై నిరసన తెలిపేందుకు ఈ నెల 27న ఛలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి జర్నలిస్టులందరూ తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. డెస్క్ జర్నలిస్టులకు చేసిన అన్యాయంపై పోరాటం చేసేందుకు అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా భీంరావు, కో-కన్వీనర్లుగా నరేంద్ర స్వామి, సందీప్, అశోక్‌రెడ్డి, రాకేష్, శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో తదుపరి కార్యాచరణపై చర్చించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని డెస్క్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

## పశుపోషకులు జాగ్రత్తలు పాటించాలి



**అక్షరటుడే, మెండోరా:** ముప్కాల్ మండలంలోని వేంపల్లి గ్రామంలో మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులను సర్పంచ్ ఏట్టెం మహేష్ యాదవ్ పంపిణీ చేశారు. పశుపోషకులకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సునీత భరత్, గోపాలమిత్రలు ప్రణీత్, బట్టు రాజేశ్వర్ పాల్గొన్నారు.

## వేడి నీళ్ల కోసం కొట్టుకున్న విద్యార్థులు..

**ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్‌లో ఘటన**

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్చుకోవాల్సిన స్టూడెంట్స్ పరస్పరం దాడికి దిగారు. కేవలం స్నానం చేయడానికి వేడి నీళ్ల కోసం పోటీ పడి తలలు పగులకొట్టుకున్నారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ పాఠశాలలో విద్యార్థులు ఘర్షణకు దిగిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పాంగ్రాలో కొనసాగుతున్న ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్‌లో గురువారం ఉదయం ఇద్దరు విద్యార్థుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఓ విద్యార్థి స్నానం చేసేందుకు వేడి నీళ్ల కోసం వెళ్లగా.. అక్కడే ఉన్న మరో విద్యార్థితో గొడవ జరిగింది. ఈ గొడవ కాస్త ఘర్షణ వరకు దారి తీసింది. ఈ క్రమంలో ఓ విద్యార్థి తలకు తీవ్ర గాయాలైయినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పాఠశాల సిబ్బంది విద్యార్థిని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించినట్లు తెలిసింది. కాగా ఈ విషయమై బాధిత విద్యార్థి కుటుంబీకులు నాలుగో టౌన్ పోలీసు లకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. ఈ స్థాయిలో ఘర్షణ జరిగేంత వరకు సదరు పాఠశాల సిబ్బంది ఏం చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ఈ విషయం బయటకు పొక్కకుండా ఎస్ఆర్ ప్రైమ్ పాఠశాల యాజమాన్యం ప్రయత్నాలు చేయడం గమనార్హం.

**బోధన్ పట్టణ ప్రజలకు ఆహ్లాదం కరువైంది. ప్రజలు సేదదీరేందుకు ఉపయోగపడాల్సిన పార్కులు చెత్తకుప్పలు, పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. ప్రస్తుతం వాటిలో విరిగిన ఆటవస్తువులు దర్శనమిస్తున్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారుతున్నాయి. అధికారులు నిర్లక్ష్యం, నిధుల కొరత, నిర్వహణ లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని తెలుస్తోంది.**

**- అక్షరటుడే, బోధన్**



# ఆహ్లాదం కరువు

■ బోధన్ పట్టణంలో అధ్వానంగా పార్కులు ■ చెడిపోయిన ఆటవస్తువులు ■ పార్క్ పరిసరాల్లో చెత్తాచెదారం ■ పట్టించుకోని బల్దియా అధికారులు

బోధన్ పట్టణంలో 2011 లెక్కల ప్రకారం 82 వేల జనాభా ఉంది. పట్టణంలో గాంధీ పార్క్, వీరేశలింగం పార్క్, శక్కర్‌నగర్‌లో పార్కులు గతంలో ఉండేవి. ఇందులో వీరేశలింగం పార్క్, శక్కర్‌నగర్ పార్క్ ఎప్పుడో కనుమరుగు అయ్యాయి. వీటిని మున్సిపల్ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ఉదయం వేళ వృద్ధులు, యువత వ్యాయామం, వాకింగ్ నిర్వహించేందుకు ఎలాంటి అవకాశం లేకుండా పోయింది.

### అధ్వానంగా గాంధీ పార్క్

పట్టణంలోని గాంధీపార్క్ కొన్నేళ్ల క్రితం బల్దియా నిర్వహణలో ఉండేది. అదొక్కటే పట్టణ ప్రజలకు కొన్నాళ్ల వరకు ఆహ్లాదాన్ని పంచింది. ఉదయాన్నే యువత, వృద్ధులు పార్క్‌లో వ్యాయామం చేసేవారు. సాయంత్రం చిన్నారులు ఆడుకునేవారు. రానురానూ దీనిని కూడా బల్దియా పట్టించుకోవడం మానేసింది. అనంతరం పట్టణ ప్రజల నుంచి విమర్శలు రావడంతో ఓ ప్రైవేట్ వ్యక్తికి లీజ్‌కు ఇచ్చారు. సదరు వ్యక్తి కొన్ని నెలలు మాత్రమే పార్క్ నిర్వహణను చూసుకున్నాడు. అనంతరం లీజ్ విషయంలో తేడాలు రావడంతో అతడిని తొలగించినట్లు తెలిసింది. అప్పటి నుంచి పార్క్ చెత్తచెదారం వేసే ఒక డంపింగ్ యార్డులాగా తయారైంది.

### ఎన్ని అభ్యర్థనలు వచ్చినా..

బోధన్ పట్టణంలో ఆహ్లాదం కోసం మున్సిపాలిటీకి ఎన్నో అభ్యర్థనలు వచ్చాయి. కానీ గత బల్దియా పాలకవర్గాలు వీటిని నిర్లక్ష్యం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కులను అభివృద్ధి చేస్తే ప్రజలకు ఆహ్లాదాన్ని పంచినట్లు అవుతుందని పట్టణ వాసులు అంటున్నారు.

### పార్కుల అభివృద్ధికి కృషి చేస్తాం

బోధన్ పట్టణంలో పార్కుల అభివృద్ధికి ప్రయత్నాలు చేస్తాం. గతంలో గాంధీ పార్క్‌ను లీజ్‌కు ఇచ్చారు. కానీ సరైన నిర్వహణ జరగలేదని తెలిసింది. పార్కుల డెవలప్మెంట్ కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తాం.

**- జాదవ్ కృష్ణ,**
**మున్సిపల్ కమిషనర్, బోధన్**

## నట్టల నివారణ మందుల పంపిణీ



**అక్షరటుడే, బాల్కొండ:** బాల్కొండ మండలం బస్సాపూర్‌లో మేకలు, గొర్రెలకు ఉచిత నట్టాల నివారణ మందులను పంపిణీ చేశారు. బస్సాపూర్ సర్పంచ్ పి.శ్రీనివాస్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి ఆర్.ఉజ్వల, గోపాలమిత్ర ప్రణీత్, షకీల్, బషీర్, ఆఫీస్ సబార్డినేట్ లక్ష్మి, జీవాల పెంపకదారులు ముత్యం, రవి, పశుమిత్రలు పాల్గొన్నారు.

### సోంపేట, సావెల్ గ్రామాల్లో



పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోంపేట, సావెల్ గ్రామాల్లో మేకలు, గొర్రెలకు ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ నిర్వహించారు. సోంపేటలో సర్పంచ్ తోట మల్లేష్ చేతుల మీదుగా 1,650 జీవాలకు మందులు అందించారు. సావెల్‌లో ఉపసర్పంచ్ రవి చేతుల మీదుగా 466 జీవాలకు నట్టాల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ప్రవీణ్, ఆఫీస్ సబార్డినేట్ మల్లేష్ పాల్గొన్నారు.

## ఐలాపూర్‌లో బ్రహ్మంగారి వార్షికోత్సవం



**అక్షరటుడే, లింగంపేట:** లింగంపేట మండలంలోని ఐలాపూర్ గ్రామంలో గురువారం బ్రహ్మంగారి ద్వితీయ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆరాధన, యజ్ఞ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు కమ్మర్ పండరి, వడ్ల భీమయ్య, కమ్మరి వెంకటేశం, బ్రహ్మం, భాస్కర్, రఘుపతి, వెంకటి, బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

## శంభుని గుడిలో చోరీ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని శంభుని గుడిలో చోరీ జరిగింది. పట్టపగలు ఓ వ్యక్తి ఆలయంలోకి చొరబడి పూజ సామగ్రి ఎత్తుకెళ్లాడు. ఈ ఘటన బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శంభుని గుడిలోకి ఓ వ్యక్తి గోడదూకి ప్రవేశించాడు. అనంతరం వెండి హారతి పల్లాలు, శఠగోపురం, ఇత్తడి పూజ సామగ్రి, పంచలోహ హారతి పళ్లెం, రాగి ప్లేట్లు తీసుకుని పరారయ్యాడు. సాయంత్రం పూజారి వచ్చి చూసే సరికి పూజ సామగ్రి కనిపించలేదు. ఈ విషయాన్ని ఆలయ ఛైర్మన్ బింగి మధుకు తెలిపాడు. ఆయన ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండో టౌన్ ఠాణా ఎస్సై ముజాహిద్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు. ఓ వ్యక్తి పూజ సామగ్రిని ఎత్తుకెళ్తున్న దృశ్యాలు అందులో రికార్డు అయ్యాయి. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు. కాగా.. సదరు వస్తువులను మిర్చి కాంపౌండ్ ప్రాంతంలో పాత సామాన్లు కొనుగోలు చేసే వ్యక్తి కొన్నట్లు సమాచారం. దొంగకు రూ.200 ఇచ్చి పూజా సామగ్రి తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.



నిజామాబాద్ నగరంలోని బీజేపీ కార్యాలయంలో..



బాన్సువాడ మండల కేంద్రంలో..

## ఉమ్మడి జిల్లాలో వాజ్‌పేయి జయంతి

దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని ఉమ్మడి జిల్లాలో గురువారం నిర్వహించారు. బీజేపీ, వివిధ సంఘాల ఆధ్వర్యంలో వాజ్‌పేయి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

**–అక్షరటుడే, నెట్‌వర్క్**



ఎల్లారెడ్డి మండల కేంద్రంలో..



బోధన్ పట్టణంలో..



లింగంపేటలో..

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పలువురు బాధితులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసినట్లు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. బాధితులు ధరణి మల్లయ్య, కొత్తపల్లి రాజేశ్వర్, రాజేశ్‌లకు సంబంధించిన ఫోన్లను గురువారం ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో అందజేశారు.



## గోవింద్‌పేట్‌లో సీసీ కెమెరాలు ప్రారంభం

**అక్షరటుడే, ఆర్మూర్:** మండలంలోని గోవింద్‌పేట్ గ్రామంలో 30 సీసీ కెమెరాలను ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర రెడ్డి, ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ అప్పల గణేష్, ఉపసర్పంచ్ దార్ల సుశీల్ కుమార్, వీడీసీ ఛైర్మన్ కాశీరెడ్డి భోజన్న పాల్గొన్నారు.



## హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆందోళన

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మరణకాండపై హిందూ ధర్మ పరిరక్షణ సమితి, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ మేరకు కమ్మర్‌పల్లిలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బంగ్లాదేశ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన దాడిని బంగ్లాదేశ్ ప్రభుత్వం అడ్డుకొని దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దొంతుల రమణయ్య, వూట్నూర్ రాజశేఖర్, రామస్వామి, చింత ప్రవీణ్, పోల్కం నవీన్, ప్రభాకర్, చింత నాగరాజు, నరేందర్, రఘు, నవీన్ గౌడ్, రామదాసు, రాజన్న పాల్గొన్నారు.